వసతులు లేక ఇబ్బంది



మామిడిపల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయం



మూత్రశాలలు తొలగించడంతో ఖాళీగా ఉన్న స్థలం

- మామిడిపల్లి సీతారామస్వామి ఆలయంలో వసతులు కరువు
- తాగునీరు, మూత్రశాలలు లేక ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

కోనరావుపేట: మండలంలో ప్రసిద్ధిగాంచిన మామిడిపల్లిలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సమస్యలు దర్శనమిస్తున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులకు సరైన వసతులు లేక మహిళలు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నవి తొలగించారు..

మామిడిపల్లి దేవస్థానంలో ఇదివరకు కల్యాణ వేదిక సమీపాన ఉన్న మూత్రశాలలను అధికారులు తొలగించారు. ఆలయానికి వచ్చే భక్తులు వాటిని వినియోగించేవారు. కొన్నేళ్ల క్రితం తొలగించిన మూత్రశాలల స్థానంలో కొత్తవి నిర్మించాలని భక్తులు కోరినా ఇప్పటివరకు మూత్రశాలలు నిర్మించలేదు. తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతున్నా కార్యరూపం దాల్చడం లేదు.

మహిళల ఇక్కట్లు

సీతారామచంద్రస్వామి ఆలయానికి కొంతకాలంగా రోజూ భక్తులు వస్తున్నారు. అంతకుముందు అంతంత మాత్రంగానే ఉండే భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది. అది గాక ఆలయంలో వివాహాలు జరిపించడం మళ్లీ ప్రారంభమైంది. దీంతో ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కానీ ఆలయంలో ఎలాంటి వసతులు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

మహిళలకు ఇబ్బంది



మామిడిపల్లి ఆలయానికి ప్రతి రోజూ వివిధ గ్రామాల నుంచి భక్తులు వస్తున్నారు. ఆలయంలో భక్తులకు కనీస వసతులు కల్పించడం లేదు. ఆలయంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు లేకపోవడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలి

– పద్మ, భక్తురాలు, మామిడిపల్లి

సౌకర్యాలు కల్పించాలి



సీతారామచంద్రస్వామి ఆలయం ఈ ప్రాంతంలో ప్రసిద్ధమైంది. శ్రీరామ మాలధారణ భక్తులందరూ ఇక్కడే ఉంటున్నారు. కోరిన కోర్కెలు తీర్చే దేవునిగా భక్తులు భావిస్తారు. అలాంటి ఆలయంలో సరైన వసతులు లేక భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. మామిడిపల్లి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని వసతులు సమకూర్చాలి

– కులేరు రవి, మాలధారుడు



గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలో మినీ వాటర్ ట్యాంకుల వద్ద నల్లాలకు బిరడాల్లేవు. చివరకు ప్లాస్టిక్ బాటిళ్లనే నీటి నియంత్రణకు వాడుతున్నారు. పంచాయతీలో నిధులు లేకనా.. నిర్వహణ లోపమా.. అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
రాజేందర్, ఎంపీడీవో, 9989930730

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లింక్ లైన్ స్ట్రింగ్, మెయింటనెన్స్ పనులు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈఈ పృథ్వీధర్ గౌడ్ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మండలంలోని రాచర్ల తిమ్మాపూర్, రాచర్లగుండారం, దేవునిగుట్టతండా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక



బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి రేణుకా మాతా ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జనగం లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా బిగుల పర్శరామ్, కోశాధికారిగా ముత్యం రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా సావనపెల్లి నారాయణ, ప్రదాన సలహాదారులుగా ఇల్లెందుల బాలయ్య, కత్తెరపాక శంకరయ్య, జంగిటి బాలయ్య, వరికోలు మల్లేశం, మరాఠి తిరుపతి, కొండ శ్రీనివాస్, మరాఠి రాజయ్య, టీ. శ్రీనివాస్, నల్లాల రమేశ్, తాళ్లపెల్లి రాజు, ఎగుర్ల మల్లయ్య ఎన్నికయ్యారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

బోయినపల్లి: సామాజిక సేవలో భాగస్వాములు కావాలని, పద్మశాలీ సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు మండల పద్మశాలీ సమాజసేవా సంఘం ప్రధాన కార్యదర్శి బిల్ల సత్యం పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. గ్రామంలో చేపట్టిన ఉచిత గుండె వైద్యశిబిరం విజయవంతమైందన్నారు. సంఘం అధ్యక్షుడు బిల్ల మల్లేశం, నాయకులు శ్రీపతి శ్రీనివాస్, కరుణాకర్ తదితరులున్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు పంపిణీ

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలంలో మొదటి విడతలో 325 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీరికి మంగళవారం చెక్కపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇళ్ల మంజూరు పత్రాలను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో పాటు అన్నిశాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరుకానున్నారు.

సర్టిఫికెట్ల అందజేత



శిక్షణ సర్టిఫికెట్లతో విద్యార్థులు

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ హైస్కూల్‌లో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్, ఇంటర్‌నెట్ కాన్సెప్టులు, ప్రాథమిక కోడింగ్ సాంకేతికతపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. హెడ్‌మాస్టర్ బొలగం శ్రీనివాస్, పీఎస్ హెచ్‌ఎం మల్లేశం, ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్లు మహేందర్, శైలజ, పీడీ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న చైతన్య కృష్ణారెడ్డి

ఇల్లంతకుంట: పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు, నిబంధనల మేరకు కార్యకర్తలు పనిచేయాలని టీపీసీసీ మండల అబ్జర్వర్లు చైతన్య కృష్ణారెడ్డి, ఎండీ ఫక్రుద్దీన్ అన్నారు. మండలకేంద్రంలోని వైశ్యభవన్‌లో మండల, గ్రామశాఖల అధ్యక్షుల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామ, మండలశాఖల అధ్యక్షుల ఎన్నిక పారదర్శకంగా జరగాలన్న ఉద్దేశంతో ఎన్నికల ప్రక్రియకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు అబ్జర్వర్లు పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కే భాస్కర్ రెడ్డి, పలు గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు, అధికసంఖ్యలో పాల్గొన్నారు

కలెక్టర్‌కు ఫిర్యాదు

ఇల్లంతకుంట: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద రుణంకోసం దరఖాస్తు చేసుకున్నా లబ్ధిదారులకు మంజూరులో జరుగుతోందని సోమవారం బీజేపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ బ్యాంకు ఉన్నతాధికారులను ఆదేశించారని శ్రీనివాస్ తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ తిరుపతి

రుద్రంగి: అభివృద్ధిని చూసి ఓర్వలేక, తమ ఉనికి కోల్పోతున్నామన్న భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి ఆరోపించారు. సోమవారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేశారన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో మండల కేంద్రంలో పేదవారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, కొద్ది రోజుల్లోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. గ్రామంలో ఎవరైనా ఇళ్లు లేని నిరుపేదలుంటే తమ దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే సహకారంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, బీసీసెల్ మండల అధ్యక్షుడు గండి నారాయణ, లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ కొమిరె శంకర్, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, పిడుగు లచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగం రావడం లేదని యువకుడు ఆత్మహత్య



ప్రసన్న కుమార్ (ఫైల్)

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన ఓ యువకుడు ఉరేసుకొని మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన చేరాల రాజేశం – సుగుణల కుమారుడు చేరాల ప్రసన్నకుమార్ (27) బీఫార్మసీ పూర్తిచేసి హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం కోసం పరీక్షరాయగా రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి తన నలుగురు స్నేహితులకు విందు ఇచ్చి అనంతరం సోమవారం తెల్లవారుజాము తాను అద్దెకుంటున్న గదిలోని బాత్రూమ్‌లో ఉరేసుకున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి తల్లిదండ్రులు, అక్క నందిని ఉన్నారు. హైదరాబాద్‌లోని కోఠి పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రసన్నకుమార్ కళ్లను ఎల్వీప్రసాద్ ఆస్పత్రికి దానం చేశారు.'

'ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి సరికాదు'

ఇల్లంతకుంట: సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడిచేయడం సిగ్గుచేటని మండల మాజీ వైస్ ఎంపీపీ, బీఆర్‌ఎస్ నాయకుడు సుధగోని శ్రీనాథ్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడిచేసిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకోకుండా బీఆర్‌ఎస్ నాయకులపై లాఠీచార్జ్ చేయడం ఏంటన్నారు.

భవన నిర్మాణ కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఇల్లంతకుంట: మండల భవన నిర్మాణ రంగాల కార్మికులు సోమవారం ఉదయం హైదరాబాదుకు వెళ్తుండగా పోలీసులు రేపాకలో అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకుని వదిలిపెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న తమను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఎంతవరకు సమంజసమని జిల్లా అధ్యక్షుడు పండుగ శంకర్ అన్నారు.

చిన్నపాటి వర్షానికి విత్తనాలు నాటొద్దు

బోయినపల్లి: చిన్నపాటి వర్షాలకే రైతులు తొందరపడి పత్తి విత్తనాలు నాటవద్దని ఎంఏవో కే.ప్రణీత పేర్కొన్నారు. ఎంఏవో మాట్లాడుతూ 60 మి.మీ వర్షపాతం నమోదు అయిన తర్వాతే విత్తనాలు నాటాలని సూచించారు. తొలకరి వర్షాలకు భూమి ఉష్ణోగ్రత తగ్గదని దీంతో విత్తనాలు సరిగ్గా మొలకెత్తవన్నారు. మోస్తరు వర్షం కురిశాకే పత్తి విత్తనాలు నాటాలని కోరారు. పత్తిలో అంతర పంటగా కందులు సాగు చేస్తే మంచి లాభాలు ఉంటాయన్నారు. పత్తి పంటను బోదెల పద్ధతిలో నాటాలని రైతులకు సూచించారు. వరి కొయ్యలు కాల్చవద్దని కోరారు.

కనిపించిన 'ఆరుద్ర'



గంభీరావుపేట: వానాకాలానికి ముందే తొలకరి పలకరించింది. వానాకాలం పంటలసాగుకు రైతులు సిద్ధమవతున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో అన్నదాతలు బిజీబిజీగా కనిపిస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో మే నెలలోనే వానలు కురిశాయి. దీంతో రైతులు పంటల సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా, అరుద్ర కార్తెలో కనిపించే అరుద్ర పురుగులు రోహిణి కార్తెలో రైతులకు దర్శనమిస్తున్నాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర గ్రామం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. నంబర్ ప్లేట్‌లేని ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా సోమవారం అరెస్ట్ చేశారు. జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకుల మధ్య ఘర్షణ జరుగగా, కాంగ్రెస్ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న నాయకులను పోలీసులు అడ్డగించి అరెస్ట్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు, నాయకులు మెండే శ్రీనివాస్, గుండాడి రాంరెడ్డి, పందిర్ల శ్రీనివాస్, బండారి బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్, సంతోష్, మాన్సింగ్ తదితరులున్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల

వేములవాడరూరల్: వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న పశు వైద్యశాల శిథిలావస్థకు చేరింది. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఈ పశువైద్యశాల ఎలాంటి మరమ్మతులు లేకుండా ఉంది. ప్రస్తుతం వర్షాకాలంలో ఎప్పుడు కూలుతుందోనని ఉద్యోగులు భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. నూతన భవనం కోసం ఇప్పటికీ పలుసార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ మంజూరు కావడం లేదని వాపోతున్నారు. వెంటనే నూతన భవనాన్ని మంజూరు చేయించాలని వారు కోరుతున్నారు.






మొలకెత్తిన ధాన్యం

కోనరావుపేట: మండలంలోని ధర్మారం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం మొలకెత్తింది. గ్రామానికి చెందిన రైతు ఆసరి లక్ష్మణ్ కొనుగోలు కేంద్రంలో 15 రోజుల క్రితం ధాన్యాన్ని పోశాడు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సెంటర్‌లోని ధాన్యం మొలకెత్తింది. కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో సోమవారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	0	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	0	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	01	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	03	448
పార్వతీపురం స్పెషల్	05	672
పార్వతీపురం సాధారణ	04	336

– వేములవాడ

ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా పూర్తిచేయాలి



నిమ్మపల్లిలో పనులు ప్రారంభిస్తున్న అధికారులు

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రెడ్డి, హౌజింగ్ డీఈ ముజఫర్, ఏఈ సాయిప్రసన్న, ఏపీవో శ్రీనివాస్, కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, ఏఎంసీ డైరెక్టర్లు బాశెట్టి నాగరాజు, అజీమ్, నాయకులు పెంతల శ్రీనివాస్, చేపూరి గంగాధర్, నాగండ్ల భూమేశ్, శ్రీధర్, మానుక సత్యం, కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే మందకృష్ణకు పద్మశ్రీ



మాట్లాడుతున్న లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట: మాదిగజాతి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం చేసిన పోరాట ఫలితంగానే పద్మశ్రీ అవార్డు దక్కిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 27న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. ఈనెల 31న వరంగల్‌కు వస్తారని ఘన స్వాగతం తెలిపేందుకు తరలిరావాలని కోరారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల అధ్యక్షులు సోమారపు శరవింద్, వడ్లూరి రాజం, నాయకులు రాజేశ్, నర్సయ్య, దేవయ్య, సతీశ్, సోమారపు లక్ష్మణ్, చంద్రన్న,సురేశ్, అశోక్, సత్తయ్య పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు నమోదు



వేములవాడరూరల్: రాజీవ్ యువవికాసం కోసం దరఖాస్తు చేసుకున్న ఫైళ్లను అధికారులు పరిశీలిస్తున్నారు. వేములవాడ రూరల్ మండలం నుంచి వచ్చిన ఫైళ్లను ఎంపీడీవో కార్యాలయంలో రెండ్రోజులుగా అర్హులైన లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్నారు. 17 గ్రామాల నుంచి 1,289 దరఖాస్తులు రాగా వారిలో బ్యాంకు నిబంధనల ప్రకారం లబ్ధిదారుల సిబిల్ స్కోర్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపిక రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆశయాల కొనసాగింపే నిజమైన నివాళి



నివాళి అర్పిస్తున్న రమణ కుటుంబ సభ్యులు, మిత్రులు



మాట్లాడుతున్న నలిమెల భాస్కర్

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్

ఎల్లారెడ్డిపేట: రిటైర్డ్ ఉపాధ్యాయుడు రమణ ఆశయాలు గొప్పవని.. సంస్మరణ సభలతోనే మరిచిపోకుండా ఆచరణలో పెట్టాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ కోరారు. రిటైర్డ్ టీచర్ కందుకూరి రమణ సంస్మరణ సభను అతని మిత్రులు ఎల్లారెడ్డిపేటలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భాస్కర్ మాట్లాడుతూ.. రమణ ప్రగతిశీల భావాలతోపాటు మానవత్వం గల వ్యక్తి అన్నారు. ఆయన ఆలోచనలతో ఏర్పటైన 'ప్రాణహిత', 'స్వా' సేవలను భవిష్యత్‌లో కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రముఖ కవి జూకంటి జగన్నాథం మాట్లాడుతూ ఈ మట్టిలోనే మానవత్వం ఉందన్నారు. ఉద్యమాలతో నిరుపేదలకు అండగా నిలిచిన వారు ఎల్లారెడ్డిపేట చుట్టుపక్కల గ్రామాల్లో పుట్టిన మల్లయ్య, పదిర మల్లారెడ్డి, దుమాల నారాయణరెడ్డి వంటి వారి భావాలు రమణలో కనిపించేవి అని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ.. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పుడు.. ఎంచుకున్న మార్గంలో ప్రజలకు మంచి చేసుకుంటూ ముందుకెళ్లాలని రమణ చెప్పారని గుర్తు చేసుకున్నారు. రంగినేని మోహన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బుర్క గోపాల్, వడ్నాల నర్సయ్య, పాత లింగాలు, దొంత ఆనందం, మిత్రులు గంప నాగేంద్రం, శర్మ, మనోహరాచారి, మోతె దేవిరెడ్డి, లద్దునూరి తిరుపతి, నలిమెల సత్యం, లింగాల సుదర్శన్, మద్దికుంట లక్ష్మణ్ తదితరులు జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రమణ సోదరుడు రిటైర్డ్ టీచర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేటలో పుట్టిన మా తమ్ముడు రమణ, దొంత మార్కండేయుల మార్గాలు వేరైనా ఆశయాలు ఒక్కటేనన్నారు. మా తమ్ముడి ఇందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవడం కుటుంబ సభ్యులుగా తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రమణ కుటుంబ సభ్యులు, శిష్యులు, మిత్రులు, కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళి అర్పించారు.

ఉచిత వైద్యశిబిరం

వీర్నపల్లి: కంచర్లలో ఉచిత వైద్యశిబిరం కొనసాగుతుంది. ఎల్లారెడ్డిపేట మండల వైద్యాధికారి సరియా అంజుమ్ ఆధ్వర్యంలో పలువురికి మందులు పంపిణీ చేశామన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.